14-07-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 51 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



## అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

■ **సికింద్రాబాద్ బోనాల జాతరలో సీఎం రేవంత్..**

**జయభేరి, హైదరాబాద్ :**

సికింద్రాబాద్ బోనాల జాతర అట్టహాసంగా జరుగుతోంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి రేవంత్ పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న సీఎం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆ తల్లిని కోరుకున్నట్లు సీఎం తెలిపారు. సీఎంతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. హర్యానా గవర్నర్ బంగారు దత్తాత్రేయ తోపాటు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లష్కర్ బోనాల సందర్భంగా ఇప్పటికే ఆలయ పరిసరాలు భక్తులతో కిటికటలాడుతున్నాయి. ఆషాడమాసంలో జరిగే బోనాల జాతరకు చాలా ప్రత్యకత ఉంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే ఈ పండుగ సందర్భంగా జరుపుకుంటున్నారు. ఈ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ జాతరను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైభవంగా నిర్వహిస్తోంది.



2 లో

## కాల్పుల ఘటన..

### తీన్మార్ మల్లనపై డీజీపీకి ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తనపై అనుచిత వ్యాఖ్యలు చేసి, జాగృతి కార్యకర్తలపై దాడి చేయించినట్లు ఆరోపిస్తూ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో ప్రభుత్వ పాత్రను కూడా ఆమె ప్రశ్నించారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డీజీపీ ఆఫీస్‌కు వెళ్లి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై ఫిర్యాదు చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసి, జాగృతి కార్యకర్తలపై దాడి చేయించి, కాల్పులు చేయించిన ఘటనపై ఆమె ఈ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కంప్లైయింట్ ఇచ్చిన తర్వాత కవిత మీడియాతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ.. "నా పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న మీద కంప్లైంట్ చెయ్యడానికి డీజీపీ గారి ఆఫీసుకు వచ్చాను. మా జాగృతి కార్యకర్తలపై దాడి చేయించింది తీన్మార్ మల్లన్ననా? లేక ప్రభుత్వమా? అనేది తెలియాలి. దీని మీద సమగ్ర విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఇవాళ ఇంత పెద్ద సంఘటన జరుగుతుంటే డీజీపీ ఆఫీస్‌కి రాకపోవడం అంటే దీని వెనక ప్రభుత్వం కూడా ఉందని మేం అనుకోవాల్సి వస్తుంది.

# క్రెడిట్ పోరు
# మామూలుగా లేదుగా..

బీఆర్ఎస్ vs కాంగ్రెస్.. బొట్టుబొట్టులో రాజకీయం.. వాటర్ ఆల్వేస్ మేటర్స్. రాజకీయాల్లో అదే అతి పెద్ద హీటర్. తెలంగాణ వాటర్ వార్‌లో క్రెడిట్ పోరు షురూ అయింది. పాత సర్కార్.. ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ అంటే, నీటి విడుదల మీది, దాని క్రెడిట్ మాత్రం మాది అంటూ కౌంటర్ ఇస్తోంది విపక్షం. అధికార విపక్షాల మధ్య నీటి పారుదల రాజకీయం గలగలా సాగుతోంది.



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ వాటర్ వార్‌లో నయా ట్రెండ్ షురూ అయింది. ప్రాజెక్టులు, వాటి ఖర్చుల లెక్కలు, అవినీతి ఆరోపణలు, అంకెలురంకెలు పక్కకుపోయాయి. ప్రస్తుతం నీటి పారుదల రాజకీయం ప్రవహిస్తోంది. ప్రాజెక్టుల చుట్టూ లేటెస్ట్ పొలిటికల్ రౌండ్ షురూ అయింది. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల విషయంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్...సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రాజెక్టుల నుంచి కాంగ్రెస్ సర్కార్ విడుదల చేస్తున్న ప్రతి నీటిబొట్టు తమ కష్టమే అంటోంది గులాబీ పార్టీ. నీటి విడుదల తమ పుణ్యమే అంటూ క్లెయిమ్ చేసుకుంటోంది బీఆర్ఎస్.. లేటెస్టుగా భద్రాద్రి సీతారామ ప్రాజెక్ట్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. అశ్వాపురం మండలం బీ.జీ. కొత్తూరు దగ్గర.. మొదటి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలు ప్రవహించాయి. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కావడంతో.. పంటలు ఎండకుండా గోదావరి జలాలను విడుదల చేసినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

**సీతారామ తమ కష్టమే అంటున్న BRS**

ఇదంతా తమ కష్టమే అంటోంది బీఆర్ఎస్. గతంలో కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషంగా ఉందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. సీతారామ ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసినట్టే, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న

...మిగతాది 2 లో



## రాజ్యసభకు కొత్తగా నలుగురు నామినేట్..

### పార్లమెంటరీ ఇన్నింగ్స్ అద్భుతంగా సాగాలన్న ప్రధాని

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 13:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నలుగురు ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభకు ఎంపికైన నలుగురికి మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాల్లో వారు చేసిన కృషిని అభినందించారు. వారి పార్లమెంటరీ ఇన్నింగ్స్ అద్భుతంగా సాగాలంటూ ప్రధాని ఒక్కొక్కరి గురించి ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నలుగురు ప్రముఖులను రాజ్యసభకు నామినెట్ చేశారు. గతంలో వారు చేసిన సేవలు.. వారికున్న అనుభవాన్ని దృష్టిలో వారిని ఎంపిక చేశారు. కసబ్ కేసు ప్రాసిక్యూటర్.. ఉజ్వల్ దేవరావ్ నిగమ్, కేరళకు చెందిన సామాజిక కార్యకర్త, విద్యావేత్త సదానందన్ మాస్టర్, మాజీ విదేశాంగ

...మిగతాది 2 లో

## సింగపూర్‌కు చంద్రబాబు బృందం



**జయభేరి, అమరావతి :**

అమరావతి రాజధాని నిర్మాణం.. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సింగపూర్‌కు వెళ్లనున్నారు సీఎం చంద్రబాబు నాయుడు. ఈనెల 26 నుంచి 30 వరకు సింగపూర్‌లో పర్యటించనుంది చంద్రబాబు బృందం. సింగపూర్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాలతో సమావేశం కానుంది. నగరాల ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యాన వనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనపై చర్చలు జరపనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు నారాయణ, నారా లోకేశ్, టీజీ భరత్, అధికారులు సింగపూర్ వెళ్లనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని సింగపూర్

...మిగతాది 2 లో



## సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే ఘన విజయం..

■ **శశిథరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు..**

**జయభేరి, కేరళ :**

కేరళ కాంగ్రెస్‌లో శశిథరూర్ వివాదం మరింత ముదిరింది. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో UDF కూటమి తరపున తనను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే ఘనవిజయం ఖాయమన్న థరూర్ వ్యాఖ్యలపై

...మిగతాది 2 లో

## పెళ్లైన ఏడేళ్ల తర్వాత షాకింగ్ ప్రకటన



భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ సోషల్ మీడియాలో ఓ షాకింగ్ ప్రకటన చేశారు. తన భర్త పారుపల్లి కశ్యప్ తో విడిపోతున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ఆదివారం, జూలై 13న, సైనా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక చిన్న ప్రకటన విడుదల చేసింది. దాదాపు 7 సంవత్సరాల వివాహబంధానికి సైనా, కశ్యప్ ముగింపు పలికారు. ఆదివారం రాత్రి సైనా నెహ్వాల్ ఒక షాకింగ్ ప్రకటన విడుదల చేసింది.. అందులో "కొన్నిసార్లు జీవితం మనల్ని వేర్వేరు దిశలలోకి తీసుకువెళ్తుంది. చాలా ఆలోచించి, పరిశీలించిన తర్వాత, పారుపల్లి కశ్యప్, నేను విడిపోవాలని నిర్ణయించుకున్నాం.

...మిగతాది 2 లో




## వీసాల్లో ఇంగ్లాండ్ కొత్త రూల్స్ అమల్లోకి

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 13:**

యునైటెడ్ కింగ్‌డమ్‌లో రేపటి నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈవీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలోని భారీ మార్పుల్లో భాగంగా ఈవీసాలను తీసుకొస్తోంది. ఫలితంగా.. రేపటి నుంచి జారీ అయ్యే అన్ని వీసాలు వాటిని పొందేవారి పాస్‌పోర్టులతో లింకై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. వాస్తవానికి.. యూకేలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడిలో పెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది.

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## రాజ్యసభకు కొత్తగా నలుగురు..

కార్యదర్శి.. హర్షవర్ధన్ ష్రింగ్లా, చరిత్రకారులు, రాజకీయ శాస్త్రవేత్త డా.మీనాక్షి జైన్.. రాష్ట్రపతి నామినేట్ చేసినవారిలో ఉన్నారు. గతంలో నామినేట్ చేసిన సభ్యుల పదవీ విరమణంతో మిగిలిపోయిన ఖాళీల భర్తీ సందర్భంగా వీరిని ఎంపిక చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(a) ప్రకారం రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక కొత్తగా రాజ్యసభకు నామినేట్ అయినవారికి మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నలుగురి గురించి మోదీ ప్రత్యేక ట్వీట్లు చేశారు. న్యాయవాద వృత్తి పట్ల ఉజ్వల్ నికమ్ చూపిన ఆదర్శప్రాయమైన అంకితభావం, రాజ్యాంగ విలువల పట్ల అచంచలమైన నిబద్ధతను మోదీ ప్రశంసించారు. తన న్యాయవాద వృత్తిలో రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడంతో పాటు సాధారణ పౌరులకు అండగా నిలిచారని కొనియాడారు. ఆయన పార్లమెంటరీ ఇన్నింగ్స్ అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగా సదానందన్ మాస్టర్ చేసిన కృషిని ఈ సందర్భంగా మోదీ అభినందించారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. ధైర్యానికి ఆయన ప్రతిరూపం అని చెప్పారు. దేశాభివృద్ధికి ఆయన కొనసాగిస్తున్న స్ఫూర్తిని బెదిరింపులు అడ్డుకోలేకపోయాయన్నారు. రాజ్యసభకు ఎంపికైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దౌత్యవేత్త, మేధావి వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా ప్రత్యేకతను చాటుకున్న వ్యక్తి హర్ష్ వర్ధన్ ష్రింగ్లా అంటూ మోదీ కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా దేశ విదేశాంగ విధానానికి కీలక సాయం అందించారు. ఆయన ప్రత్యేక దృక్పథాలు పార్లమెంటరీ కార్యకలాపాలను బాగా మెరుగుపరుస్తాయని చెప్పారు. ఆమెను రాజ్యసభకు నామినేట్ చేయడం ఆనందంగా ఉందన్నారు.

## వీసాల్లో ఇంగ్లాండ్ కొత్త రూల్స్

ఈవీసా రూల్‌తో విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజర్ అంశాలను ప్రయాణానికి ముందే చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. సరికొత్త విధానంతో పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను నిలిపివేసి.. దీనికి బదులు ఈవీసా జారీ చేయనుంది యూకే. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఈవీసాల్లో విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు కచ్చితంగా ఉండాలని స్పష్టం చేస్తోంది. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులు చేయాలనుకున్నా ఆయా వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఇక.. ఈవీసా జారీ నేపథ్యంలో ఇంగ్లాండ్ జర్నీ ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?.. అనేది పరిశీలిస్తే.. విద్యార్థులు కచ్చితంగా యూకే వీసా ఇమ్మిగ్రేషన్ అకౌంట్ క్రియేట్ చేసుకొని ఈవీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేసేందుకు ఉపయోగపడుతుంది. యూకే ఈవీసా అప్‌డేట్ నేపథ్యంలో విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యూకేలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్, విశ్వవిద్యాలయాలు యూకేవీఐ అకౌంట్స్‌ను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇక.. వీసా జారీ అయ్యాక.. పాస్‌పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆ వివరాలను విద్యార్థులు తమ ఇంగ్లాండ్ జర్నీకి ముందే తమ యుకేవీఐ అకౌంట్స్‌లో అప్‌డేట్ చేయాలి. మొత్తంగా.. మోడ్రన్ టెక్నాలజీ అనుగుణంగా వీసాల్లో ఇంగ్లాండ్ సరికొత్త రూల్స్ అమల్లోకి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే.. ఈవీసా విషయంలో ఇంగ్లాండ్ వెళ్లే విద్యార్థులు అలెర్ట్ కావాల్సి ఉంది.

## పెళ్లైన ఏడేళ్ల తర్వాత..

మేము మా ఇద్దరి కోసం ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నాం. మా జ్ఞాపకాలకు నేను కృతజ్ఞురాలిని, ముందుకు సాగేటప్పుడు అంతా శుభమే జరగాలని కోరుకుంటున్నాను. ఈ సమయంలో మా ప్రైవసీని అర్థం చేసుకుని, గౌరవించినందుకు ధన్యవాదాలు." అంటూ రాసుకొచ్చారు. సైనా, కశ్యప్ హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో కలిసి పెరిగారు. సైనా ఒలింపిక్ కాంస్యం, వరల్డ్ నంబర్ 1 ర్యాంకింగ్‌తో గ్లోబల్ స్టార్‌గా ఎదిగింది. కశ్యప్ కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడు. పదేళ్ళకు పైగా ప్రేమించుకున్న తర్వాత ఈ జంట 2018లో పెళ్లి చేసుకుంది. పారుపల్లి కశ్యప్ బ్యాడ్మింటన్ నుంచి రిటైర్ అయిన తర్వాత కోచింగ్‌లోకి మారాడు. సైనా కెరీర్ చివరి సంవత్సరాలలో ఆమెకు కోచ్‌గా వ్యవహరించాడు. 2019 నేషనల్ ఛాంపియన్‌షిప్స్‌లో పీవీ సింధును ఓడించినప్పుడు కశ్యప్ ఆమెకు కోచ్‌గా ఉన్నాడు. 2016 తర్వాత సైనా ఎదుర్కొన్న గాయాల నుంచి కోలుకోవడానికి కశ్యప్ ఆమెకు సహాయం చేశాడు. మైదానంలో, టోర్నమెంట్లలో కశ్యప్ సైనాకు వ్యూహాత్మక సలహాలు, సపోర్ట్ ఇస్తూ కనిపించేవాడు. సైనా చివరగా జూన్ 2023లో ప్రొఫెషనల్ సర్క్యూట్ లో ఆడింది. ఈ దిగ్గజ షట్లర్ ఇంకా రిటైర్మెంట్ ప్రకటించలేదు. కశ్యప్ మాత్రం ఈ ప్రకటనపై ఇంకా స్పందించలేదు.

## సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే..

భగ్గుమంటున్నారు కాంగ్రెస్ నేతలు. తాను సీఎం కావాలని 28.3 శాతం ప్రజలు కోరుకుంటున్నారని ఓ సర్వేలో తేలిందని ట్వీట్ చేశారు శశిథరూర్. అయితే దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కేరళ కాంగ్రెస్ నేతలు.. ముందు ఆయన ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలంటున్నారు. శశిథరూర్ ముందు ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలన్నారు సీనియర్ కాంగ్రెస్ నేత మురళీధరన్. ఒకవేళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో UDF కూటమి గెలిస్తే సర్వేలో టాప్‌లో ఉన్న వ్యక్తి సీఎం కాబోరని , వేరే నేతే సీఎం అవుతారని స్పష్టం చేశారు. హైకమాండ్ ఆదేశాలను ధిక్కరించి కాంగ్రెస్ అధ్యక్ష పోటీలో నిలిచినప్పటికి నుంచి శశిథరూర్ తీరుపై గాంధీ కుటుంబం తీవ్ర ఆగ్రహంతో ఉంది. తమకు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ముఖ్యమని, శశిథరూర్ వ్యాఖ్యలతో సంబంధం లేదని కేరళ కాంగ్రెస్ స్పష్టం చేసింది. శశిథరూర్ బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. థరూర్ కూడా అదే కోరుకుంటున్నారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాటు విదేశాంగ విధానంలో ప్రధాని మోదీని పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు థరూర్.. కాంగ్రెస్ హైకమాండ్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికి థరూర్‌ను ఆపరేషన్ సింధూర్‌పై ప్రపంచదేశాలకు వివరించేందుకు అఖిలపక్ష బృందంలో కేంద్రం పంపించింది.

## క్రెడిట్ పోరు మామూలుగా లేదుగా..

రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు హరీష్. ఈమేరకు ఆయన Xలో పోస్ట్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ నుంచి జలాల విడుదల క్రెడిట్ తమదేనంటూ చెప్పకనే చెప్పారు హరీష్.

**కల్వకుర్తి విషయంలోనూ సేమ్ సీన్**

ఇక కొద్ది రోజుల ముందు కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. అప్పుడు కూడా ఇలాంటి ట్వీట్‌తోనే పొలిటికల్ హీట్ పెంచారు హరీష్. సాగునీరందక అవస్థపడుతున్న లక్షలాదిమంది రైతులతో తరలివచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటే గాని ప్రభుత్వంలో చలనం రాలేదని, తాము ప్రశ్నించాకే.. కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అది తమ విజయమే అంటూ తమ ఖాతాలో వేసేసుకున్నారు హరీష్‌రావు. బొట్టుబొట్టులో రాజకీయంతో తెలంగాణ పాలిటిక్స్ వేడెక్కాయి.

## సింగపూర్‌కు చంద్రబాబు బృందం

ప్రభుత్వాన్ని కోరనున్నారు. 2014లో అమరావతిని రాజధానిగా ప్రకటించాక.. క్యాపిటల్ సిటీ నిర్మాణం కోసం అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.. సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సింగపూర్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేసింది. 2024లో మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. చంద్రబాబు ఈనెల 26న సింగపూర్ వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. అక్కడి ప్రభుత్వంతో, అధికారులతో చర్చలు జరిపి తిరిగిరానున్నారు.

## కాల్పుల ఘటన..

అసలు తీన్మార్ మల్లన్న గన్‌మెన్స్ ఎందుకు షూట్ చెయ్యాల్సి వచ్చిందనేది తెలియాలి. మల్లన్న ఆదేశాలు లేకుండా గన్ మెన్స్ షూట్ చేయరు. మా కార్యకర్తలపైన కాల్పులు జరిపిన తీన్మార్ మల్లన్న గన్‌మెన్లను వెంటనే డిస్మిస్ చేయాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఏ గన్ మెన్ కానీ, పోలీసులు కానీ కాల్పులు జరపలేదు. కానీ ఈ రోజు తీన్మార్ మల్లన్న గన్ మెన్స్ ఇలా కాల్పులు జరపడం బాధాకరం." అని కవిత వెల్లడించారు.

# వృధాగా మారిన కోచింగ్ డిపో...

## రైళ్లు రాకుండా అడ్డుపడుతున్న ట్రావెల్స్...

**జయభేరి, విజయవాడ, జూలై 13:**




స్వప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టడం విజయవాడ రాజకీయానికే చెల్లుతుంది. అన్నీ సిద్ధంగా ఉన్నా వందే భారత్ రైలును మంజూరు చేయకుండా స్థానిక రాజకీయం అడ్డుపడుతోంది. ఏడాదిన్నర క్రితమే వందే భారత్ ర్యాక్ మెయింటెయినెన్స్ డిపో సిద్ధమైనా, సాంకేతిక సమస్యలు, రైళ్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది.స్వప్రయోజనాల ముందు ప్రజల సమస్యలు, అవసరాలు పట్టవని విజయవాడ రాజకీయం రుజువు చేసింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు తమకు వందే భారత్ రైళ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుంటే విజయవాడ కేంద్రంగా నడిచే రాజకీయం మాత్రం రైళ్లు రాకుండా అడ్డుపడుతున్నాయి. ఎప్పుడో రావాల్సిన వందే భారత్‌కు ఆటంకాలు సృష్టిస్తున్నాయి.విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్స్ లేవు. పైనుంచి వచ్చే రైళ్లలో విజయవాడ కోటా పెద్దగా ఉండదు. దీంతో టిక్కెట్లు దక్కడం దాదాపు అసాధ్యం. దీంతో విజయవాడ బెంగుళూరు మధ్య ట్రావెల్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. నిత్యం పెద్ద సంఖ్యలో ట్రావెల్స్ బస్సులు బెంగుళూరుకు నడుస్తుంటాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 9 గంటల మధ్యలో విజయవాడ వారధి నుంచి పెద్ద సంఖ్యలో బెంగుళూరుకు ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. 12 13 గంటల ప్రయాణ సమయమైనా ఈ బస్సుల్లో టిక్కెట్లకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది.

విజయవాడ నుంచి బెంగుళూరుకు వందే భారత్ రైలు వస్తే ట్రావెల్స్ వ్యాపారానికి గండి పడుతుంది. ప్రస్తుతం ఉన్న 1314 గంటల ప్రయాణం 9 గంటలకు తగ్గిపోతుంది. ఇప్పటికే రైళ్ల రాకపోకల షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. గత మేలోనే వందే భారత్‌కు పాలనాపరమైన అనుమతులు లభించగా, ట్రైన్ సర్వీస్ జూన్‌లో మొదలు కావాల్సిఉంది. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా 9గంటల్లోనే బెంగుళూరు చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ఖరారు చేశారు. వందే భారత్‌కు రైల్వే బోర్డు అనుమతించగానే ట్రావెల్స్ వ్యాపారులు రాజకీయ నేతల్ని ఆశ్రయించారు. తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఒత్తిడి చేయడంతో వందే భారత్‌కు అనుమతి రాలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌విశాఖపట్నం మధ్య విజయవాడ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. త్వరలోనే విజయవాడ నుంచి బెంగుళూరుకు మరో సర్వీసును ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విజయవాడలో చేశారు.విజయవాడ నుంచి బెంగుళూరు వందే భారత్ జాప్యం కావడంపై రైల్వే వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానిక రాజకీయాలే కారణంగా తెలుస్తోంది.

ఈ ఏడాది రైల్వే బడ్జెట్ రూపకల్పన సమయంలో జీఎంతో ఏపీకి చెందిన ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ల వారీగా అందరి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. ఈ క్రమంలో బెంగుళూరుకు డైరెక్ట్ రైళ్ల ఏర్పాటు అంశం కూడా ప్రస్తావనకు రావడంతో దానిని పక్కన పెట్టాల్సిందిగా ప్రజా ప్రతినిధులు సూచించడంతో రైల్వే అధికారులు విస్తుబోయారు.విజయవాడ నుంచి బెంగుళూరు వైపు పరిమిత సంఖ్యలో రైళ్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విజయవాడ నుంచి ప్రస్తుతం యశ్వంతపూర్ రైలు మాత్రమే బెంగుళూరుకు ఉంది. విజయవాడ మీదుగా ప్రయాణించే ఇతర జోన్ల రైళ్లలో డివిజన్ కోటా సీట్లు ఉండవు. దీంతో విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లాలనుకునే సగటు ప్రయాణికులకు సీట్లు దక్కే పరిస్థితి లేదు.దశాబ్దాలుగా విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్ వేయకపోవడానికి ట్రావెల్స్ రాజకీయమే కారణమని రైల్వే వర్గాలు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల వ్యాపారాన్ని కాపాడేందుకే ప్రజా ప్రతినిధులు కొత్తరైళ్లను రాకుండా అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘ ప్రయత్నాలు, రైల్వే అధికారుల చొరవతో కొత్త రైలును తిరుపతి మీదగా బెంగుళూరుకు నడిపేందుకు రైల్వే శాఖ అనుమతించినా మళ్లీ రాజకీయం అడ్డుపడింది. వందేభారత్ సిరీస్ రైళ్లు మొదలైన తర్వాత విజయవాడ బెంగుళూరు మధ్య కొత్త రైలును ప్రారంభించాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. తొలి దశలో సికింద్రాబాద్‌విశాఖపట్నం మధ్య మొదటి రైలు ప్రారంభమైంది. ఆ తర్వాత విశాఖ నుంచి హైదరాబాద్‌కు మరో వందే భారత్ ప్రారంభించారు. రెండు రైళ్లు ఏకకాలంలో విశాఖపట్నం, సికింద్రాబాద్ నుంచి గమ్య స్థానాలకు బయల్దేరుతున్నాయి.బెంగుళూరుకు వందే భారత్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులు కొద్దినెలల క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ నుంచి బెంగుళూరుకు ప్రస్తుతం ప్రయాణ సమయం 1214 గంటలకు పైగా పడుతోంది. వందే భారత్ రైలు అందుబాటులోకి వస్తే తొమ్మిది గంటల్లోనే గమ్య స్థానాన్ని చేరుకోవచ్చు. దాదాపు మూడు నుంచి ఐదు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది.

వందే భారత్ రైలుతో బెంగళూరు వెళ్లే వారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకు కూడా అనువుగా ఉంటుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్ కార్ బోగీలు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌తో ఈ సర్వీస్ నడుపుతారు. వారంలో మంగ ళవారం మినహా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ ఖరారు చేశారు.ట్రైన్ నంబర్ 20711 విజయవాడ బెంగుళూరు వందే భారత్ విజయవాడలో ఉదయం 5.15 బయలుదేరి తెనాలి 5.39కు చేరుతుంది. ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి, 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు మధ్యాహ్నం 14.15 గంటలకు చేరుతుంది.తిరుగు ప్రయాణంలో అదే రోజు ట్రైన్ నంబర్ 20712 బెంగ ళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు ప్రారంభం అవుతుంది. కృష్ణరాజపురం మధ్యాహ్నం 2.58, కాట్పాడి 5.23, చిత్తూరు సాయంత్రం 5.49, తిరుపతి 6.55, నెల్లూరుకు రాత్రి 8.18, ఒంగోలుకు రాత్రి 9.29, తెనాలి రాత్రి 10.42, విజయవాడ 11.45కు చేరుతుంది. ఇప్పటికే వందే భారత్ రైలు రాకపోకలు మొదలు పెట్టాల్సి ఉన్నా స్థానిక నాయకుల ఒత్తిళ్లతో ర్యాక్స్ విజయవాడ చేరుకోలేదని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.విజయవాడ నుంచి ప్రధాన నగరాలకు నేరుగా వందే భారత్ రైళ్లను నడపాలనే ఉద్దేశంతో మూడేళ్ల క్రితమే రైల్వే శాఖ ఏర్పాట్లు ప్రారంభించింది. ఇందులో భాగంగా అప్‌యార్డ్ కాలనీ సమీపంలో పాలఫ్యాక్టరీ వెనుక భాగంలో రూ.140కోట్ల రుపాయల వ్యయంతో వందే భారత్ కోచింగ్ డిపో, ర్యాక్ మెయింటెయినెన్స్ సెంటర్ నిర్మించారు. ఇందులో ఏకకాలంలో మూడు ర్యాక్స్ (మూడు పూర్తి స్థాయి రైళ్లు) మెయింటెయిన్ చేసేలా డిపోను నిర్మించారు. ఈ డిపో నిర్మాణ సమయంలో సాంకేతిక అంశాలను విజయవాడ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు విస్మరించినట్టు తెలుస్తోంది. మరోవైపు బెంగుళూరుకు రైళ్లను నడపడంలో జాప్యానికి గుంతకల్లుధర్మవరంబెంగుళూరు మార్గంలో రైల్వే విద్యుదీకరణ పనుల్లో జాప్యం జరగడం కారణమని అధికారులు చెబుతున్నారు. గుంతకల్లు, ధర్మవరం సెక్షన్ పనులు ఇప్పటికే పూర్తైనా, ధర్మవరంబెంగుళూరు సెక్షన్ పనులు పూర్తి కాలేదు. ధర్మవరంపెనుకొండ మధ్య పనులు సాగుతున్నాయి.43 కిలోమీటర్ల మార్గాన్ని విద్యుదీకరించడానికి టెండర్లు పూర్తైనా పనులు పూర్తికాలేదు. ఏపీ కర్ణాటక మధ్య రాకపోకలు వేగంగా జరగడంతో పాటు రాయలసీమ ప్రాంతాలకు ఏపీ రాజధానితో అనుసంధానించవచ్చని చెబుతున్నారు,.విజయవాడ రైల్వే స్టేషన్ పది ప్లాట్‌ఫామ్‌ల నుంచి అప్‌యార్డ్‌లో నిర్మించిన కొత్త కోచింగ్ డిపోకు రైళ్లు చేరుకునేలా కనెక్టివిటీ ఇవ్వడం అధికారులు మరిచారు. ప్రస్తుతం పదో నంబర ప్లాట్‌ఫాంకు వచ్చిన రైళ్లు మాత్రమే కొత్త కోచింగ్ డిపోకు వెళ్లే అవకాశం ఉంది. మిగిలిన తొమ్మిది ప్లాట్‌ఫామ్‌లతో ఈ డిపోకు కనెక్టివిటీ లేనట్టు చెబుతున్నారు.ఇటీవల రైల్వే బోర్డు అధికారుల తనిఖీల్లో ఈ అంశం వెలుగు చూసింది. రూ.140కోట్లు ఖర్చుతో నిర్మించిన డిపోకు ఇంటర్ లాకింగ్ కనెక్టివిటీ లేకపోవడంపై బాధ్యులైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మరోవైపు విజయవాడ నుంచి బెంగుళూరుకు డైలీ సర్వీస్ నడపడానికి రెండు వైపులా ప్రయాణించే రెండు ర్యాక్స్ మంజూరు చేసేలా రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

# కొండా అంశాన్ని ఏం చేద్దాం..





**జయభేరి, వరంగల్, జూలై 13:**

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తామని, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు... అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది. తమను దూషించిన వారిని వదిలేసి... అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు vs కొండా మురళిగా మారిపోయింది.

ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది. క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ.ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

# దివ్యాంగుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఉబ్బాని ఆంజనేయులు
- టీజీడిజేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరి దుర్గయ్య

**జయభేరి, గజ్వేల్, జూలై 13 :**



విహెచ్పిఎస్, టిజిడిజేఏసీ వివిధ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16 న హలో దివ్యాంగు.. చలో సిద్ధిపేట్ దివ్యాంగుల జిల్లా మహాసభ కు ముఖ్యఅతిథిగా దివ్యాంగుల ఆత్మబంధువుడు విహెచ్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రావడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఉబ్బాని ఆంజనేయులు, టీజీడిజేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరి దుర్గయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా గాని దివ్యాంగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం 4016 పెన్షన్ ను 6016 వరకు, వృద్ధులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు 2016 నుండి 4016 వరకు పెన్షన్ పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచకపోవడం చాలా బాధాకరం అని తెలిపారు. ఎన్నో దివ్యాంగుల కుటుంబాలు ఆసరా పెన్షన్ పైన బతుకుతున్నారని తెలిపారు. నేడు సకాలంలో పెన్షన్ పడక ఎంతో ఇబ్బంది పడుతూ వచ్చిన పెన్షన్ కూడా వారి హాస్పిటల్ ఖర్చులకు కూడా సరిపోవటం లేదని చెప్పారు. కొంతమంది దివ్యాంగులు ఒక పూట తింటూ మరో పూట పస్తులు ఉంటూ కాలం గడుపుతున్నారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగుల బాధలు కనిపించడం లేదా ? దివ్యాంగులు అంటే ఇంత చిన్న చూపా ? దివ్యాంగులు అంటే వివక్షత ఎందుకో తెలియడం లేదని అన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం లేదు. దివ్యాంగులు మహిళల కంటే అద్వానమా లేక దివ్యాంగుల్లాగా కనపడడం లేదా అని మండిపడ్డారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డ్స్ మంజూరు చేయడం లేదు. దివ్యాంగులకు కూడా రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి బాధలు ఎన్నో ఉన్నాయి. సభ స్థలం కాబట్టి ఈనెల 16న సిద్దిపేట పట్టణ కేంద్రంలో బీజేఆర్ చౌరస్తా నుండి కోమటి చెరువు రోడ్డులో ఆర్ఎస్ మెట్రో గార్డెన్ లో చేపట్టబోయే దివ్యాంగుల జిల్లా మహాసభ కు గజ్వేల్ నియోజకవర్గం నుండి దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి బాబు, కనకయ్య, లింగయ్య, నర్సింలు, వెంకటేశం, సుగుణ, రామవ్వ, బాబు, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## గోరింటాకు విశిష్టత తెలుపుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆషాఢమాస కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ మండలం మహిళా విభాగం పెదపాటి కృష్ణవేణి, బొద్దపు నూకరత్నం, బబొద్దపు పూర్ణ కింతాడ వరలక్ష్మి కలిసి అచ్యుతపురం వికలాంగుల ఆశ్రమం లో ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు పిల్లలు పెట్టడం, పిల్లలకు గోరింటాకు ఉపయోగాలు, ఈ ఆషాఢమాసం లో ఎందుకు పెట్టుకోవాలని వివరించారు.ఆషాఢమాసం అంటే నేలలో తేమ ఎక్కువగా ఉంటుందని వర్షం తో నేలలో చిత్తడిగా ఉంటుందని అందువలన ఎక్కువ వైరస్, క్రిమికీటకాలు ఎక్కువగా ఉంటాయి అన్నారు అందువల్ల చేతులకు గోరింటాకు పెట్టుకుంటేనే వైరస్ చనిపోయిన తాయని పిల్లలకి వివరించారు.దీని వలన ఆరోగ్యంగా ఉంటామని చర్మం బాగుటుందని వివరించారు అలాగే దీనితో పాటు పూరాణాలలో గోరింటాకు విశిష్టత గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల. కరస్పాండంట్ పి. ఎస్.టి.పట్నాయక్, అసిస్టెంట్ హెడ్ మాస్టర్ .పాలిపిల్లి శ్రీను,ఉపాధ్యాయులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.




## శివయ్య సేవ లో కొల్లు రవీంద్ర

**జయభేరి, శ్రీకాళహస్తి జులై 13:**

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలసి శ్రీకాళహస్తీశ్వరాలయంకు విచ్చేశారు. శనివారం సహస్ర లింగం వద్ద ప్రత్యేక రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బాపి రెడ్డి స్వాగతం పలికారు తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్ధ ప్రసాదాలు,మంత్రి కొల్లు రవీంద్ర కు ఇఓ అందజేశారు.

# గుర్తుకొస్తున్నాయి..!

- 25 ఏళ్ల తర్వాత ఒక్కచోటికి పూర్వ విద్యార్థులు.. భావోద్వేగ దృశ్యాలు

**జయభేరి, యాదాద్రి జిల్లా :**



1999, 2000 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని.. చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం కలుసుకొని ఆత్మీయత పంచుకున్నారు. అప్పటి స్నేహితులు అందర్నీ కలిసి వారితో ముచ్చటిస్తూ.. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటుంటే.. ఆ అనుభూతి వర్ణణాతీతం. ప్రస్తుతం ఆయా రంగాల్లో సెటిల్ అయిన వారు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పాతిక సంవత్సరాల తరువాత అందరం ఒకే వేదిక వద్ద కలుసుకోవడంతో అందరు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చదువుకున్న పాఠశాలకు కొంత అర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# బీసీ వర్గాల సాధికారతకు కాంగ్రెస్ ఇచ్చిన భరోసా

- దేశంలోనే మొట్ట మొదటి సారి స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్,కాంగ్రెస్ పార్టీతో బీసీలకు సముచిత స్థానం
- మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడిపల్లి :**




స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బోడుప్పల్ లో మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై, మాజీ ప్రజాప్రతినిధులతో పాటు, బీసీ సంఘాల నాయకులతో కలసి లోకసభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గార్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఆర్డినెన్స్ జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి మండలికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇది కేవలం గణాంకాల ప్రాతినిధ్యం కాదు... ఇది బీసీ వర్గాల సాధికారతకు కాంగ్రెస్ ఇచ్చిన భరోసా. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా బీసీలకు న్యాయం జరగనప్పుడు... తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు ధైర్యం, న్యాయం, ప్రతినిధ్యం కల్పించారు.


# వర్గల్ మండలంలో బిఆర్ఎస్ షాక్ ..

- బీజేపీ లో చేరిన బిఆర్ఎస్ నాయకులు....
- పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానిస్తున ఎంపీ..

**జయభేరి, వర్గల్, జూలై 13 :**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై నమ్మకంతో యువత బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారని బీజేపీ వర్గల్ మండల అధ్యక్షుడు బోలిపల్లి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం శాకారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఆయన మిత్ర బృందంతో కలిసి బొల్లిపల్లి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని వారు సూచించారు. బీజేపీలో చేరిన నాయకులకు కాషాయ కండువా కప్పి రఘునాధన్ రావు పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ వర్గల్ మండల్ మాజి ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్ ,సీతారాంపల్లి బూత్ అధ్యక్షుడు రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొనారు.





## కాలనీ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ డబుల్ బెడ్ రూమ్ డిగ్నిటీ కాలనీ మంజీరా నీటి ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భగా స్వంత నిధులతో కాప్రా డివిజన్ 1 బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బైరి నవీన్ గౌడ్ గారు నీటి కలెక్షన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ 1 బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు, కాలని వాసులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని MNR Badminton Court లో జరిగిన విస్టా బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ లో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నిలుపుతాయి అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే



**జయభేరి, ఉప్పల్ :**

ఓల్డ్ రామంతాపూర్ జరిగిన Dr BR Ambedkar సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన మాదిగ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లైబ్రరీ ఏర్పాటు చేస్తా అని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బోసాని పవన్, సూరం శంకర్, ముత్యాల నరహింహా, అధ్యక్షుడు ఆనంద్, నర్సింహా, భరత్, అశోక్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు
- వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ముద్దం రాజిరెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, జులై 13 :**

శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలో బోనాల ఉత్సవాలు గ్రామస్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో ఎటు చూసినా బోనాల పండగ కళ ఉట్టిపడింది. వేకువ జాము నుంచే మహంకాళి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఇక మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక స్థానికులు అయిన ముద్దం రాజారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ఈ యేడు వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలు పండి అందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేసుకున్నట్లు వారు తెలిపారు. ఇక భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయం వద్ద సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేతా...

■ ఆర్థిక సహాయం చేస్తున్న మేకల కనకయ్య ముదిరాజ్

**జయభేరి, గజ్వేల్, జూలై 13 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బొడ్డు చిన్నలక్ష్మి నర్సయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మర్కుక్ మండల్ బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ అదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటు పాములపర్తి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్ మేకల డేవిడ్ పిట్ల ప్రశాంత్ బైకడి వెంకటేష్ తదితరులు ఉన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

■ తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్



**జయభేరి, గజ్వేల్, జూలై 13 :**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో ఆదివారం రోజున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేయడం జరిగింది.పాములపర్తి గ్రామానికి చెందిన ఉప్పరి సత్యనారాయణకు 28500 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్.

## అక్రమ అరెస్టును ఖండించిన తెలంగాణ జాగృతి నియోజకవర్గ అధ్యక్షులు



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత 42 శాతం బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేస్తూ ఉంటే సహించలేని క్యూ న్యూస్ అధినేత తీన్మార్ మల్లన్న కవిత పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని దేవరకొండ నియోజకవర్గం తెలంగాణ జాగృతి అధ్యక్షులు లకుమారపు మల్లయ్య తీవ్రంగా ఖండించారు. పోలీసులు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తెలంగాణ జాగృతి నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. ఆదివారం తనను అరెస్టు చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు.

## నాగులపల్లిలో ఘనంగా బోనాల జాతర

■ అంగరంగ వైభవంగా అమ్మవారి బోనాల జాతర



**జయభేరి, షాద్ నగర్, జులై 13 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఆదివారం నాగులపల్లి గ్రామంలో ఘనంగా బోనాల పండుగ. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో ప్రతి ఏటా అందరు గ్రామస్తులు కలిసి మెలసి ఘనంగా పోతరాజుల ఆటపాటలతో అంగరంగ వైభవంగా బోనాల పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషకరంగా ఉంటుందని అన్నారు. గ్రామంలో వ్యక్తులు వివిధ ప్రదేశాలలో నివసిస్తున్న ప్రతి ఒక్కరు బోనాల పండుగకు ప్రత్యేకంగా తమ గ్రామానికి విచ్చేసి కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృప పొందుతారని అన్నారు. గ్రామ యువత, మహిళలు ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించి వారి మొక్కలను తీర్చుకుంటారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీగా గ్రామ యువత, గ్రామ మాజీ వార్డు సభ్యులు, గ్రామ వివిధ పార్టీల నాయకులు, గ్రామ యువత, అధికంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రచ్చగా మారుతున్న మామిడి ధర

**జయభేరి, తిరుపతి, జూలై 13:**



మామిడి ధర.. ఇప్పుడు రచ్చగా మారింది. ఏపీలో రాజకీయాన్ని రంజుగా మార్చింది. మద్దతు ధర అందకపోవడంతో రోడ్డెక్కిన రైతాంగం సమస్య రాజకీయ రంగు పులుముకుంది. ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మామిడి ధర పతనానికి అసలు కారణమేంటి. మామిడి రైతుకు ఎందుకింత కష్టం వచ్చిందన్న దానికంటే మ్యాంగో ఫైట్ చేస్తున్న పొలిటికల్ పార్టీలదే పెద్ద సమస్యగా మారింది. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు ఉన్నట్లే... చిత్తూరు జిల్లాలో మామిడి రైతాంగం కష్టాలకు బోలెడన్ని కారణాలు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా మామిడి ధరలు పతనం కావడంతో కంటతడి పెడుతున్న రైతాంగం పండిన పంటను అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణంతో పాటు ఈ ఏడాది దిగుబడి అమాంతంగా పెరగడంతో మామిడి కొనేవారు కరువయ్యారు. దీంతో మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతాంగం సమస్య రాజకీయ అస్త్రంగా మారింది. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోగా రైతుకు మాత్రం తీపి పంట చేదుగానే మిగిలిపోయింది. అసలు ఈ ఏడాది ఎందుకు మామిడి రైత కు ఎప్పుడూ లేనంత కష్టం వచ్చిందన్న విషయాలను ఆరా తీస్తే అనేక కారణాలు వెలుగు చూస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం, దిగుబడిపై ఉద్యానవన శాఖ ఇస్తున్న లెక్కలను పరిశీలిస్తే కారణాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో మామిడి సాగు జరగా ఈ ఏడాది దిగుబడి 8.40 లక్షల టన్నుల మామిడి దిగుబడి జరిగింది. గతేడాది 56 వేల హెక్టార్ల లోనే మామిడి సాగు ఉండగా దిగుబడి మాత్రం దాదాపు 3.35 లక్షల టన్నులు దిగుబడి వచ్చింది. అంటే గతేడాది హెక్టార్‌కు 6 టన్నుల మామిడి దిగుబడి రాగా, ఈ ఏడాది హెక్టారు కు 15 టన్నుల మామిడి దిగుబడి అయింది. రైతు ఊహించనంత దిగుబడి రావడానికి వాతావరణ పరిస్థితులు కూడా ఏడాది అనుకూలించాయి. మరోవైపు ఏప్రిల్ మే వరకు వర్షాలు రావడంతో మామిడి సైజు విపరీతంగా పెరిగింది. మామూలుగా 350 నుంచి 400 గ్రాముల బరువుతో దిగుబడి వచ్చే మామిడి ఈ ఏడాది 700 నుంచి 750 గ్రాముల వరకు కాయ సైజు పెరిగింది. దీంతో హెక్టారుకు రెండింతల నుంచి మూడింతల దాకా దిగుబడి పెరిగింది.ఇక మామిడి ధర విషయంలోనూ గతేడాదికి ఏడాది ధరకు ఎంతో వ్యత్యాసం ఉంది. గతేడాది టన్ను తోతాపూరి మామిడి రకం రూ. 22 నుంచి 26 వేల దాకా రైతులకు లభించింది. అయితే ఈ ఏడాది టన్ను ధర రూ. 10 వేలు కూడా అందరి పరిస్థితి నెలకొంది. పల్ప్ పరిశ్రమలు టన్నుకు రూ. 6 వేల దాకా ఇస్తుంటే ప్రభుత్వం ప్రోత్సాహక ధరగా టన్నుకు రూ.4 వేలు చెల్లిస్తోంది. ఈ లెక్కన టన్ను తోతాపూరి మామిడి కి రూ. 10 వేలు ధర దక్కుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే చిత్తూరు జిల్లాలో మార్కెట్ యార్డ్‌ల వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు టన్ను ధర రూ.3 వేలకు మించి ఇవ్వక పోవడంతో రైతుకు గిట్టుబాటు ధర అందడం లేదు. మరోవైపు పల్ప్ యాజమాన్యాలు టన్ను మామిడికి రూ. 8 వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. నష్టాలను సాకుగా చూపి టన్ను కు రూ.6 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. అయితే రేటు కూడా ఇచ్చి కొనుగోలు చేయని పల్ప్ యాజమాన్యాల తీరు రైతులకు సంకటంగా మారింది. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక ధర కూడా రైతుల ఖాతాలకు చేరకపోవడంతో రైతుకు మద్దతు ధర గాలిలో దీపంగా మారింది.ఇక మరో కారణం రాష్ట్రంలో అన్నిచోట్ల ఒకేసారి మామిడి సీజన్ ప్రారంభం కావడం. గతేడాది ముందుగా కృష్ణ ఆ తరువాత ఇతర జిల్లాల నుంచి మామిడి దిగుబడి రాగా ఈ ఏడాది అంతటా ఒకేసారి మామిడి రైతు చేతికి అందింది.

ఇక ఈ ఏడాది మామిడి గుజ్జు తయారీ పరిశ్రమల పైనా అనేక విమర్శలు రాగా మామిడి రైతుకు సరైన ధర లభించక పోవడానికి పల్ప్ యూనిట్ యాజమాన్యాలు కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 44 పల్ప్ ప్రాసెస్ యూనిట్లు ఉండగా ఈ ఏడాది 39 యూనిట్లు మాత్రమే మామిడి గుజ్జు తయారీ చేశాయి. గతేడాది పల్ప్ పరిశ్రమల్లో తయారైన మామిడి గుజ్జు ఎక్స్పోర్ట్ కాకపోవడంతో పెద్ద ఎత్తున నిల్వలు ఉండడం కూడా ఒక కారణం అయ్యింది. రూ. కోట్ల విలువచేసే పల్ప్ పరిశ్రమంలోనే ఉండిపోవడంతో ఈ ఏడాది ప్రాసెస్ చేయడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి ఏటా మే 20 తరువాత పల్ప్ యూనిట్లు ప్రాసెసింగ్ ప్రారంభిస్తుండగా ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా జూన్ 7 న గుజ్జు పరిశ్రమలు తెరుచుకున్నాయి. దీంతో ఒకేసారి మామిడి దిగుబడి రావడం, రైతులు పల్ప్ ఇండస్ట్రీస్ కు మామిడిని విక్రయించేందుకు ప్రయత్నం చేయడంతో గందరగోళం నెలకొంది. దిగుబడికి తగ్గట్టుగా డిమాండ్ లేకపోవడం కూడా సమస్యగా మారిపోయింది.చిత్తూరు జిల్లాలో ఇప్పటిదాకా 2.42 లక్షల టన్నుల మామిడి పల్ప్ యూనిట్లు కొనుగోలు చేయగా ఇంకా పొలాల్లోనే 1.48 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉండిపోయింది. జిల్లాలో ఈ ఏడాది 5 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చినట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. మరో రెండు వారాల్లో మామిడి సీజన్ ముగుస్తుండగా.. ఇప్పటికీ పల్ప్ పరిశ్రమల వద్ద అమ్మకానికి మామిడి ట్రాక్టర్లు బారులు తీరిన పరిస్థితి నెలకొంది. మద్దతు ధర ఎందుకు ఇవ్వలేదు, మామిడి కొనుగోలులో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రతిపక్షం ప్రశ్నిస్తుంటే గతంలో ఎప్పుడూ లేనట్లు మామిడి రైతుకు ప్రోత్సాహక ధర కల్పించిన ప్రభుత్వం తమదని టిడిపి చెబుతోంది. అధికార విపక్షాల మధ్య మ్యాంగో వార్ పీక్స్ కు చేరుకుంటుండగా మద్దతు ధర విషయంలో మాత్రం మామిడి రైతులకు సమస్య గానే మిగిలింది.

## ఆర్గనైజింగ్ కమిటీ ఇన్చార్జిగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామకం

■ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాగార్జునసాగర్ నకిరేకల్ తుంగతుర్తిల ఆర్గనైజింగ్ కమిటీ నియోజకవర్గ ఇన్చార్జిగా సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామకం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామం కి చెందిన సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ను బీసీ ఉద్యమ నేపథ్యాన్ని గ్రహించి గత 25 సంవత్సరాలుగా వివిధ ఉద్యమ సంస్థల్లో పని చేస్తూ బీసీ ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయిలో బీసీ కమిటీల నిర్మాణం, తన అనుభవాన్ని గుర్తించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ రాజ్యసభ R కృష్ణయ్య నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, నకిరేకల్, నియోజకవర్గాలు సూర్యపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం ఆర్గనైజేషన్ కమిటీ ఇన్చార్జిలుగా నియామకం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ఉత్తర్వులు జారీ చేసినందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, దేవరకొండతో పాటు ఈ మూడు నియోజకవర్గాలలో బీసీలను చైతన్య పరుస్తూ సంస్థాగత నిర్మాణం కమిటీల ఏర్పాటు, చట్టసభల్లో రిజర్వేషన్, స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై పోరాటం చేస్తూ సాధన దిశగా ముందుకు వెళ్తానని సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు.

## నేడు నల్గొండలో మహా గర్జన

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ నియోజకవర్గం వికలాంగుల సోదరి సోదరులకు కండరాల క్షీణత సోదరులకు, వృద్ధులు వితంతువులు అన్ని రకాల సామాజిక పెన్షన్ దారులకు తెలియజేయునది ఏమనగా 14. జూలై 2025 సోమవారం రోజున నల్గొండలో అన్ని రకాల పెన్షన్దారుల మహాసభ నిర్వహించడం జరుగుతుంది. ఈ మహాసభకు వికలాంగుల ఆశాజ్యోతి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు కావున కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వంద రోజుల్లో వికలాంగులకు 6000 వృద్ధులకు 4000 రూపాయలు అన్ని రకాల పెన్షన్స్ పెంచుతామని హామీ ఇవ్వడం జరిగింది కావున నేటికీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యి 18 నెలలు గడిచిపోతున్నాయి అయినా పెన్షన్ పెంచకపోవడం బాధాకరం ఈరోజు వరకు ప్రభుత్వం అన్ని రకాల పెన్షన్ దారులను మోసం చేస్తూ కాలం గడుపుతూ వస్తుంది కావున ఈ విషయాన్ని సారం రేపు వికలాంగుల వృద్ధుల వితంతుల మహా గర్జన పేరుతో నల్లగొండలో నిర్వహించడం జరుగుతుంది ఈ మహా సభలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి ఉందాం కావున దేవరకొండ నియోజకవర్గం నుండి అన్ని రకాల ఆసరా పెన్షన్ దారులు వికలాంగులు వృద్ధులు వితంతువులు కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో దేవరకొండ నియోజకవర్గం నుండి పాల్గొని ఈ మహాసభను విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

స్థలం లక్ష్మీ గార్డెన్, హైదరాబాదు రోడ్డు, నల్లగొండ, మర్రిగూడ, ఎల్లమ్మ గుడి దగ్గర సామాజిక ఉద్యమాభివందనాలతో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకత్వం గుద్దేటి సైదులు, రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీరామదాసు వెంకటాచారి, రాష్ట్ర సీనియర్ నాయకులు. పిలుపునివ్వడం జరిగింది.

## అలియాబాద్ లో ఘనంగా బోనాలు ఉత్సవాలు

**జయభేరి, శామీర్ పేట్, జులై 13 :**



ఆషాఢ మాసం సందర్భంగా అలియాబాద్ గ్రామం లో బోనాల వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో మాల పోచమ్మ ఆలయం వద్ద ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించగా. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఇక ఈ బోనాల వేడుకల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీక అని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు వారు తెలిపారు.



## కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా..

■ కావలి భాస్కర్

**జయభేరి, మేడ్చల్ :**

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్మిక విభాగం అధ్యక్షుడు కావలి భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా కావలి భాస్కర్ ముదిరాజ్ ను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్మిక విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసుశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ భాధ్యతను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ గౌడ్,మేడ్చల్ అసెంబ్లీ లేబర్ సెల్ ఇంచార్జి సాయిపేట మల్లేష్, వినోద్, ఉదయ్ గౌడ్,మలిగే కిషన్, బండారి వెంకట్ , శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**జయభేరి, దేవరకొండ :**


దేవరకొండ యువ నాయకుడు రమావత్ హిమవంత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని, యువత క్రీడల్లో రాణించాలని గుమ్మడవల్లి గ్రామంలో, షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగబోతోంది. కావున ఆసక్తి కలవారు టోర్నమెంట్ లో పాల్గొనవలసిందిగ షేక్ ఇస్మాయిల్ కోరారు. ఈ టోర్నమెంట్‌కు పూర్తి ఆర్థిక సహాయం అందించిన దాత రమావత్ హిమవంత్ కుమార్ కి నిర్వాహకుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్ ఎంట్రీ చివరి తేదీ ఈ నెల 18. ప్రారంభం ఈ నెల 19. మొదటి బహుమతి : ₹20,116, రెండవ బహుమతి : ₹15,116, మూడవ బహుమతి : ₹10,116, ఎంట్రీ ఫీజు: ₹800. నిర్వాహకులు: పి. మల్లేష్ - 87902 92272, చింటూ (వినోద్) 97040 06126 లను సంప్రదించగలరని తెలియజేసినారు.

## మహిళా వృద్ధుల ఆశ్రమంలో భోజనాలు, పండ్లు పంపిణి

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సభ్యులు జె.ఈశ్వరయ్య రిటైర్డ్ మండల అభివృద్ధి అధికారి 73వ పుట్టినరోజు సందర్భంగా దేవరకొండ మహాలక్ష్మి మహిళా వృద్ధుల ఆశ్రమంలో మధ్యాహ్నం భోజనాలు అందజేసినారు .అని పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి తెలియజేసినారు. దాత మాట్లాడుతూ మా కార్యదర్శి నా పుట్టినరోజు గుర్తు చేస్తూ ఈ కార్యక్రమం చేస్తే బాగుంటుంది అన్న అన్నారు. వెంటనే నాకు ఆనందం కలిగి ఏర్పాటు చేయండి అనిచెప్పాను. మా చంద్రమౌళి కార్యదర్శి ఎంతో ఓపికగా అన్ని ఏర్పాట్లు చేసినారు ధన్యవాదములు.మహిళా మాతలు ఈశ్వరయ్య ని శతమానం భవతి, అన్నదాత సుఖీభవా అని దీవించిన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, అలంపల్లి శ్రీనివాసులు, ఏచ్చ చంద్రయ్య, సవ్వది పెద్దులు, అధ్యక్షురాలు మాదిరెడ్డి సంధ్యారెడ్డి,కేర్ టేకర్ జానకి పాల్గొన్నారు.


జయభేరి సినిమా
14-07-2025
సోమవారం
jayabheridaily.com



## హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి టైం ఫిక్స్..

దాదాపు మూడేళ్ల తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు. చారిత్రాత్మక నేపథ్యంలో రూపొందిన 'హరి హర వీరమల్లు' జూలై 24న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన నేపథ్యంలో, విడుదలకు నాలుగు రోజుల ముందు అంటే జూలై 20న భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలుత ఈ వేడుకను తిరుపతి లేదా విజయవాడలో నిర్వహించాలని యూనిట్ భావించినా, చివరికి విశాఖపట్నం సముద్రతీరాన్ని వేదికగా ఎంచుకున్నారు. అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌కు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని సమాచారం. రాజమౌళి అన్నగా గౌరవించే ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతాన్ని అందించడం, అలాగే పవన్ త్రివిక్రమ్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం, ఈ ఇద్దరినీ ఈ వేడుకకు ఆహ్వానించడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. నిర్మాత ఏ.ఎం. రత్నం వారిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు సమాచారం. ట్రైలర్ విడుదల అనంతరం సినిమా బిజినెస్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం ఫ్యాన్సీ ఆఫర్లు వస్తున్నట్లు టాక్.తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లోనూ ఈ సినిమా విడుదలకానుంది. పవన్‌కు పాన్‌ఇండియా స్థాయిలో ఉన్న క్రేజ్ సినిమాకు హైప్‌ను మరింత పెంచుతోంది. దర్శకుడు జ్యోతి కృష్ణ రూపొందించిన ఈ చిత్రాన్ని ఏఎం రత్నం సమర్పణలో, దయాకర్ రావు 'మెగా సూర్య ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నిర్మించారు. సినిమా సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సమకూర్చారు.పవన్ కళ్యాణ్ వీరమల్లు పాత్రలో కనిపించనుండగా ఔరంగజేబుగా ప్రతినాయక పాత్రలో బాబీ డియోల్ కనిపించి సందడి చేయనున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా కనిపించనుంది. అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నోరా ఫతేహి క ప్రత్యేక పాత్రలో కనిపించనున్నట్టు తెలుస్తుంది. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో సక్సెస్ అయిన తర్వాత విడుదలవుతున్న తొలి సినిమా హరిహర వీరమల్లు కావడంతో ఈ మూవీపై అందరిలో ఆసక్తి నెలకొంది.

## శివరాజ్‌కుమార్ క్యాన్సర్ పోరాటంపై డాక్యుమెంటరీ..




కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్న విషయం తెలిసిందే. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామీ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ కోసం శస్త్రచికిత్స చేయించుకుని విజయవంతంగా ఇండియాకు తిరిగివచ్చాడు శివన్న. అయితే క్యాన్సర్ నుంచి కోలుకున్న అనంతరం ఆ మహమ్మారిపై తాను చేసిన పోరాటాన్ని తెలియజేసేలా ఒక డాక్యుమెంటరీని తెరకెక్కిస్తున్నట్లు శివరాజ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన అప్‌డేట్‌ను ప్రకటించారు. 'సర్వైవర్' అనే పేరుతో రాబోతున్న ఈ డాక్యుమెంటరీకి ప్రదీప్ కె శాస్త్రి దర్శకత్వం వహిస్తుండగా.. శివరాజ్‌కుమార్ భార్య గీతా శివరాజ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టులో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం.
ఇక సినిమాల విషయానికొస్తే సప్త సాగరాలు దాటి చిత్ర దర్శకుడు హేమంత్ రావు దర్శకత్వంలో 666 ఆపరేషన్ థియేటర్ అనే సినిమా చేస్తున్న శివన్న.. తెలుగులో పెద్ది అనే సినిమా చేస్తున్నాడు. రామ్‌చరణ్‌బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఈ సినిమా రాబోతుంది.

## మై డియర్ మోనికా..



ఓటీటీల్లో మలయాళ సినిమాలు చూసే ఆడియెన్స్ కు సౌబిన్ షాహిర్ గురించి బాగా తెలిసే ఉంటుంది. చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాతి కాలంలో ప్రొడక్షన్ కంట్రోలర్, అసిస్టెంట్ డైరెక్టర్‌గానూ పనిచేశాడు. కొన్ని సినిమాలకు సహాయ దర్శకుడిగానూ వర్క్ చేశాడు. ఇదే సమయంలో నటనపై ఆసక్తి పెంచుకున్నాడు. మొదట చిన్న చిన్న పాత్రలు చేయడం మొదలు పెట్టాడు. అలా 2018 రిలీజైన 'సుదాని ఫ్రమ్ నైజీరియా' మూవీతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు సౌబిన్. ఈ సినిమాలో నటనకుగాను కేరళ రాష్ట్ర చలనచిత్ర పురస్కారం అందుకున్నాడీ ట్యాలెంటెడ్ యాక్టర్. కుంబలంగి నైట్స్, ఆండ్రాయిడ్ కుంజప్పన్, రోమాంచమ్ తదితర సినిమాలతో మలయాళంలో స్టార్ నటుడిగా మారిపోయాడు సౌబిన్ షాహిర్. ఇక గతేడాది 'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో పాన్ ఇండియా ఫేమస్ అయిపోయాడు. ఇదే సినిమాతో నిర్మాతగానూ సక్సెస్ అందుకున్నాడు సౌబిన్. ఇప్పుడు కూలీ సినిమాతో మరో సారి పాన్ ఇండియా రేంజ్‌లో అదృష్టం పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నాడు. కాగా కూలీ సినిమా కోసం దాదాపు 78 మూవీస్‌ని వదులుకున్నాడు సౌబిన్ షాహిర్. అందుకు తగ్గట్టుగానే ఈ మూవీలో అతని పాత్ర పవర్ ఫుల్ గా ఉండనుందని తెలుస్తోంది. మోనికా పాటలో సౌబిన్ స్టెప్పులు తెగ వైరల్ అవుతున్నాయి. పూజా హెగ్డే కంటే ఇతడి డ్యాన్సే బాగుందని కితాబిస్తున్నారు. మరి మూవీ రిలీజ్ తర్వాత సౌబిన్‌కి ఇంకెంత క్రేజ్ వస్తుందో చూడాలి.

## రచ్చ లేపుతున్న బ్యూటీ..



బాలీవుడ్ ముద్దుగుమ్మ చిత్రాంగదా సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిత్రాంగదా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించి, అక్కడే పెరిగింది. బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యింది. 2005లో హజారోన్ ఖ్వైషీన్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. ఇటీవలే హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ కనిపించింది ఈ ముద్దుగుమ్మ. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రను కూడా నేను రిజెక్ట్ చేశా.. అని తెలిపింది. సినిమాలు నిరాశపరిచినప్పటికీ ఆమె నటనకు ఎప్పుడూ మంచి మార్కులే పడ్డాయి. కానీ కమర్షియల్‌గా పెద్ద హిట్స్ లేకపోవడం ఆమె కెరీర్‌కు మైనస్‌గా మారింది. ఇప్పటికి కూడా ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో అవకాశాలు అందుకుంటుంది.

## వీడెవడో కాని రాజమౌళికే చిరాకు తెప్పించాడుగా..



కొందరికి ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించాలో తెలియదు. విచక్షణ మరిచిపోయి ప్రవర్తిస్తూ ఉంటారు. ఇటీవలి కాలంలో కొంతమంది అభిమానుల్లో కామన్ సెన్స్ కొరవడినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా సినీ సెలబ్రిటీల పట్ల ప్రవర్తించే తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మరణించడంతో ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు సినీ ప్రముఖులు వచ్చారు. అయితే, అక్కడ ఉన్న కొంతమంది అభిమానులు వారితో అనుచితంగా ప్రవర్తించారు. నటుడు ఎన్టీఆర్ కోట గారి గురించి భావోద్వేగంగా మాట్లాడి బయటకు వెళ్లే సమయంలో, కొంతమంది "జై ఎన్టీఆర్" అంటూ నినాదాలు చేయడం విచారకరం. చావు ఇంటి దగ్గర ఇలా ప్రవర్తించడం ఎన్టీఆర్ కి నచ్చలేదు. "అలా చేయొద్దు" అంటూ వారిని ఆపుతూ "జై కోట" అని నినాదం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అలాగే, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కూడా నివాళులర్పించేందుకు వచ్చారు. తన వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, కోట గారి సేవలను గుర్తు చేసుకున్నారు. అయితే, ఆయన వెళ్లిపోతున్న సమయంలో కొంతమంది అభిమానులు సెల్ఫీల కోసం వెంబడించడం మొదలుపెట్టారు. ఒక అభిమాని మాత్రం రాజమౌళికి అడ్డంగా వచ్చి సెల్ఫీకి ట్రై చేయగా, చిరెత్తిపోయిన దర్శకుడు అతడిని తోసి "ఏం రా ఇది... ఫోటోలు తీయాలంటే ఇదే టైమా?" అంటూ అసహనం వ్యక్తం చేశారు.
ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. "ఇలాంటి వాళ్లకి రెండు తగిలిస్తేనే బుద్ధి వస్తుంది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే "ఇలాంటివారిని సమయోచితంగా హ్యాండిల్ చేయడంలో బాలకృష్ణ, మోహన్‌బాబు లాంటోళ్లే కరెక్ట్ అని అభిప్రాయపడుతున్నారు. ఇక దర్శకుడు రాజమౌళి ప్రస్తుతం సూపర్‌స్టార్ మహేశ్‌బాబుతో ఓ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం తీస్తున్నారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com